# విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము

**పత్రికా ప్రకటన** **తేది. 22.10.2018.**

## <u>బ్యాగులు, పర్సుల్లో నగదు మరియు నగలను దొంగించే ఇద్దరు పాత నేరస్థురాళ్ళు అరెస్ట్</u>
## *వీరి వద్ద నుండి 19 నేరాల్లో సుమారు రూ.7 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం*

ఈ మధ్య కాలంలో నగరంలో జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక దృష్టిసారించిన నగర పోలీస్ కమీషనర్ శ్రీ సి.హెచ్.ద్వారకా తిరుమలరావు ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు క్రైమ్ డిసిపి శ్రీమతి బి.రాజకుమారి ఐపిఎస్ గారి పర్యవేక్షణలో దొంగతనాల నియంత్రణ నిమిత్తం పోలీసు గస్తీని ముమ్మరం చేయడంతో పాటు అంతర్‌జిల్లా, అంతర్ రాష్ట్ర నేరస్థులు, పాత నేరస్థులు, జైలు నుండి విడుదలైన నేరస్థులు, అనుమానాస్పద వ్యక్తులు మరియు బస్సులలో దొంగతనాలకు పాల్పడే నేరస్థులపై నిఘా ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ నేపథ్యంలో ది.21.10.2018న సిసిఎస్ పోలీసులకు అందిన సమాచారం మేరకు బీసెంట్ రోడ్డు పరిసరప్రాంతంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని విచారించడం జరిగింది. విచారణలో పలు దొంగతనం కేసుల్లో పాత నేరస్తులైన ఇద్దరు నిందితులు రద్దీ ప్రదేశాలను లక్ష్యంగా ఎంచుకుని ప్రక్కన ఉన్న వ్యక్తులు ఏమరుపాటు తనాన్ని ఆసరాగా చేసుకుని వారి బ్యాగులను కత్తిరించడం ద్వారా మరియు పర్సుల జిప్పు తీయడం ద్వారా దొంగతనాలు చేసినట్లు వెల్లడి కావడంతో వీరిని అరెస్ట్ చేసి, వీరి వద్ద నుండి **మొత్తం 19 కేసుల్లో 274 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి మరియు నగదు కలిపి మొత్తం సుమారు రూ.7 లక్షల విలువైన చోరీ సొత్తు** స్వాధీనం చేసుకోవడం జరిగింది.

గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన **దేవర శాంతకుమారి (40)** మరియు గుంటూరు జిల్లా కృష్ణాబాబు కాలనీకి చెందిన **దేవర సువార్త (50)**లు పాత నేరస్థులు. వీరిద్దరిపై గతంలో గుంటూరు జిల్లా మరియు తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు నమోదు కాగా ఆయా కేసుల్లో పలుమార్లు జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చి పాత నేరప్రవృత్తిని కొనసాగిస్తున్నారు

ఇద్దరు నిందితులు కలసి రద్దీ ప్రదేశాలు, వాణిజ్య సముదాయాల వద్ద సాధరణ వ్యక్తుల్లా జనాల్లో కలసిపోయి అనుమానం రాకుండా ఇతరుల బ్యాగులను కత్తిరించడం మరియు పర్సుజిప్పులను అలికిడి లేకుండా చాకచక్యంగా తీసి నగదు మరియు నగలను దొంగిలించడం, అదేవిధంగా బస్సుల్లో మరియు ఆటోల్లో ప్రయాణిస్తూ రద్దీగా ఉండే సమయాన్ని అదనుగా చూసుకుని అదే తరహాల్లో చోరీలకు పాల్పడటం జరిగింది.

ఈ క్రమంలో ఇద్దరు నిందితులు కలసి విజయవాడ **<u>ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో-6, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో-1, గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో-1, సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో-4, కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో-4, నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో-1, పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో-1 మరియు ఉయ్యూరుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో-1 మొత్తం 19 నేరాలు</u>** చేయడం జరిగింది.

విజయవాడ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో జరిగిన ఈ తరహా దొంగతనాలపై బాధితుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేయడం జరిగింది. నేరాలు జరిగిన విధానం మరియు ప్రదేశాలను పరిగణలోకి తీసుకుని నిందితులను పట్టుకునేందుకు నిఘా ఏర్పాటు చేసి ది.21.10.2018న సిసిఎస్ పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు వీరిద్దరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 19 కేసుల్లో మొత్తం సుమారు రూ.7 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడం జరిగింది.

--xx--